ఎన్నికల్లో 1,150 కోట్ల నగదు, బంగారం సీజ్

గత ఎన్నికల కన్నా మూడు రెట్లు అధికం

న్యూఢిల్లీ, మే 31: లోక్‌సభ ఎన్నికలు వేళ దేశ వ్యాప్తంగా జరిగిన సోదాల్లో 1,150 కోట్ల విలువైన నగదు, బంగారాన్ని ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకుంది. 2019 ఎన్నికల్లో పట్టుబడిన రూ.392 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు అధికం. వీటిలో ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో 200 కోట్లకు పైగా నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులో 150 కోట్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాల్లో 100 కోట్లకు పైగా పట్టుబడినట్టు శుక్రవారం ఆ శాఖ అధికారులు తెలిపారు. నీఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత మార్చి 16 నుంచి నియమావళి అమలులోకి రావడంతో పోలీస్, ఐటీ శాఖ ఈ దాడులు చేపట్టాయి. 10 లక్షలకు మించి పట్టుబడిన నగదును ఆదాయపు పన్ను శాఖకు పంపుతారు.

నేడే ఆఖరి పోరు

- 57 నియోజకవర్గాలకు ఎన్నికలు
- బరిలో 904 మంది అభ్యర్థులు
- 10.06 కోట్ల మంది ఓటర్లు
- 6:30కు వెలువడనున్న ఎగ్జిట్ పోల్స్
- జూన్ 4న ఫలితాల ప్రకటన

వారణాసి/చండీగఢ్, మే 31: లోక్‌సభ చివరి దశ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 57 నియోజకవర్గాలకు శనివారం పోలింగ్ జరగనుంది. 904 మంది అభ్యర్థులు ఈ విడతలో పోటీ పడుతున్నారు. మొత్తం 10.06 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 5.24 కోట్ల మంది పురుషులు, 4.82 కోట్ల మంది మహిళలు, 3,574 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న నాలుగు స్థానాలకు, యూపీలో 13, పశ్చిమ బెంగాల్‌లో తొమ్మిది, బీహార్‌లో ఎనిమిది, ఒడిశాలో ఆరు, జార్ఖండ్‌లో మూడు స్థానాలతో పాటు చండీగఢ్ స్థానానికి పోలింగ్ జరగనుంది. వీటితో పాటు ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 42 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. కాగా, శనివారం సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడికానున్నాయి.

అందరి ఆసక్తి ఈ స్థానాలపైనే

ఏడో విడతలో పోలింగ్ జరగనున్న వాటిలో పలు కీలక నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది ప్రధాని పోటీ చేస్తున్న వారణాసి. ఇక్కడ కాంగ్రెస్ నుంచి అజయ్ రాయ్, బీఎస్పీ నుంచి అతెర్ జమల్ లరి పోటీ చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కొలిశెట్టి శివకుమార్ కూడా యుగతులసి పార్టీ తరపున బరిలో ఉన్నారు. యూపీలోనే కేంద్రమంత్రులు మహేంద్రనాథ్ పాండే(చందౌలి), పంకజ్ చౌదరి(మహరాజ్‌గంజ్), అనుప్రియా పటేల్(మిర్జాపూర్) సైతం ఈ దఫాలో తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. బెంగాల్‌లోని డైమండ్ హార్బర్ నుంచి తృణమూల్ తరపున మమతా బెనర్జీ మేనల్లుడు, హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ నుంచి కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, మండి నుంచి నటి కంగనా రనౌత్ బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

ఎగ్జిట్‌పోల్స్‌పై ఉత్కంఠ

శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. ఎన్నికల ఫలితాల వెల్లడికి మరో మూడు రోజులు గడువు ఉన్న నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే ఎగ్జిట్ పోల్ ఫలితాలపై వివిధ టీవీ చానళ్లు నిర్వహించే చర్చల్లో పాల్గొనరాదని కాంగ్రెస్ నిర్ణయించింది. ఊహాగానాలు, టీఆర్‌పీల కోసం బురద జల్లుడు వ్యవహారాల్లో పాల్గొనబోమని పేర్కొన్నది.

హిమాచల్ ప్రదేశ్‌లోని తషిగాంగ్ గ్రామంలో ప్రపంచంలోనే అతి ఎత్తయిన పోలింగ్ కేంద్రాన్ని అందంగా అలంకరిస్తున్న పర్యాటకురాలు

ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

- ఎయిర్‌పోర్టులో దిగగానే అదుపులోకి తీసుకున్న మహిళా పోలీసులు
- జూన్ 6 వరకు సిట్ కస్టడీకి అప్పగించిన బెంగళూరు కోర్టు

ప్రజ్వల్‌ను అరెస్ట్ చేసి తీసుకెళుతున్న సిట్ పోలీసులు

బెంగళూరు: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ బహిష్కృత ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ఎట్టకేలకు సిట్ అరెస్టు చేసింది. శుక్రవారం తెల్లవారుజామున జర్మనీలోని మునిచ్ నుంచి వచ్చిన ప్రజ్వల్‌ను బెంగళూరు విమానాశ్రయంలో దిగగానే సిట్ బృందం అదుపులోకి తీసుకున్నది. వందలాది మంది మహిళలను లైంగికంగా వేధించారని అరోపణలను ఎదుర్కొంటున్న ప్రజ్వల్‌ను మహిళా పోలీసులే అరెస్టు చేయడం విశేషం. మహిళా ఐపీఎస్ అధికారులు సుమన్ డీ పన్నేకర్, సీమా లత్కర్ నేతృత్వంలోని మహిళా పోలీసులతో కూడిన సిట్ బృందం ప్రజ్వల్ విమానం దిగగానే అరెస్టు వారెంట్ చేతికిచ్చి పోలీసు జీపు ఎక్కించారు. పటిష్ఠ భద్రత మధ్య ఆయనను దవాఖానకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి కోర్టులో హాజరుపరచగా ఏడు రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది. దీంతో పోలీసులు ప్రజ్వల్‌ను సీఐడీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.

ఇప్పటికి మూడు కేసులు నమోదు

మాజీ ప్రధాని దేవెగౌడ మనవడైన ప్రజ్వల్ రేవణ్ణ హసన్ ఎంపీగా ఉన్నారు. ఈ ఎన్నికల్లోనూ జేడీఎస్ అభ్యర్థిగా బీజేపీ మద్దతుతో పోటీ చేశారు. ఎన్నికల వేళ ప్రజ్వల్‌కు చెందినవిగా భావిస్తున్న అశ్లీల వీడియోలు బయటకు రాగానే ఏప్రిల్ 27న అతడు జర్మనీ పారిపోయాడు. ఇప్పటివరకు ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో మూడు కేసులు నమోదయ్యాయి. రేప్ కేసు కూడా నమోదు చేశారు.

బిల్లులు రాక కాంట్రాక్టరు ఆత్మహత్య

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఘటన

బెంగళూరు, మే 31: కర్ణాటకలో బీజేపీ పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా కాంట్రాక్టర్ల కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రభుత్వంపై నమ్మకంతో అప్పోసప్పో చేసి పనులు చేసినా బిల్లులు రాక, కమీషన్లు ఇచ్చుకోలేక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని గతంలో బొమ్మై సర్కారుపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్.. ఇప్పుడు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వారికి బిల్లులు విడుదల చేయడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి తలెత్తింది. తాజాగా, దేవనగెరెకు చెందిన జీ ప్రసన్న(50) అనే కాంట్రాక్టరు సంతెబెన్నూర్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. తన ఆత్మహత్యకు కారణాలను ఓ లేఖలో రాశారు. తాను చేసిన పనులకు సంబంధించి కర్ణాటక రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ లిమిటెడ్(కేఆర్ఐడీఎల్) నుంచి బిల్లులు రావడం లేదని, తన సోదరులు నాగరాజ్, శ్రీనివాస్ తీసుకున్న డబ్బులు తిరిగిఇవ్వడం లేదని లేఖలో రాశారు. మొత్తంగా తనకు రూ.80 లక్షలు రావాల్సి ఉందని వెల్లడించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేఆర్ఐడీఎల్ అధికారులు, శ్రీనివాస్, నాగరాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ధ్యానముద్రలో మోదీ.. ఏమైనా జరిగితే.. ఇంచార్జ్ ఎవరు?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారం ముగియడంతో కన్యాకుమారిలో ప్రధాని మోదీ 45 గంటలపాటు ఏకాంత ధ్యానముద్రలోకి వెళ్లిపోయారు. అయితే, ఇదే సమయంలో దేశంలో ఏమైనా అత్యయిక పరిస్థితులు ఏర్పడితే ఇన్‌చార్జి ఎవరన్న ప్రశ్నకు.. ప్రధాని ధ్యానముద్రలో మాత్రమే ఉన్నారని, అవసరమైతే, ఆయన్ని సంప్రదించే అవకాశమున్నదని ఓ మాజీ క్యాబినెట్ కార్యదర్శి పేర్కొనగా.. ఇంచార్జీని నియమించకుండానే ప్రధాని వెళ్లడం సరైన చర్యకాదని మరో ఉన్నతాధికారి అన్నారు

శ్రీవారి సేవలో అమిత్‌షా

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత రంగనాయకుల మండపంలో అమిత్‌షా దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత దర్శనం

దివ్యాంగులు, వృద్ధులకు నేరుగా శ్రీవారి ఉచిత దర్శనం కల్పించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతించనుంది.

కాంగ్రెస్ హామీలతో దేశం నాశనమే!

- ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయే ప్రమాదం
- హామీలకు ఏటా 23 లక్షల కోట్లు అవసరం
- హస్తం మ్యానిఫెస్టోపై ఆర్థిక నిపుణుల ఆందోళన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): ఈసారి అధికారంలోకి వస్తే ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని రాహుల్ గాంధీ తరచూ చెప్పున్నారు. అయితే, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తే, దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదమున్నదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యానిపెస్టోలోని హామీలను అమలు చేయాలంటే ఖజానాపై ఏటా రూ. 23 లక్షల కోట్లకు పైగా భారం పడుతుందని, ఇది దేశ బడ్జెట్ మొత్తంలో సగమని గుర్తుచేస్తున్నారు. ఈ మేరకు 'బిజినెస్ టుడే'తో మాట్లాడారు. కాంగ్రెస్ హామీలతో ఆర్థిక వ్యవస్థపై భారం పడటమే కాదు.. అది పరోక్షంగా ద్రవ్యోల్బణం, ఉత్పాదకతపై కూడా ప్రతికూల ప్రభావం చూపవచ్చని చెబుతున్నారు.

హామీలతో ఏటా ఖజానాపై భారం ఇలా..	
కుటుంబంలోని ప్రతీ మహిళకు ఏటా తొలుత లక్ష, ఆ తర్వాత 2 లక్షలు	రూ. 8 లక్షల కోట్లు
రూ. 40 వేల కనీస వేతనంతో 30 లక్షల ఉద్యోగాలు	రూ. 1.4 లక్షల కోట్లు
డిప్లొమా పూర్తిచేసినవారికి ఏటా లక్ష	రూ. 2.6 లక్షల కోట్లు
23 రకాల పంటలకు ఎమ్మెస్పీ పెంపు	రూ. 10 లక్షల కోట్లు
ఉపాధి హామీ కనీస చెల్లింపులు రూ. 400	రూ. 80,000 కోట్లు

స్పెల్లింగ్ బీ విజేతగా నల్గొండ బాలుడు

చరిత్ర సృష్టించిన బృహత్

వాషింగ్టన్, మే 31: తెలంగాణకు చెందిన భారతీయ అమెరికన్ బాలుడు బృహత్ సోమ స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ-2024 పోటీల్లో విజేతగా నిలిచాడు. ట్రైబేకర్‌లో అత్యధికంగా 29 పదాలకు సరైన స్పెల్లింగ్ చెప్పి ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో సరికొత్త రికార్డుతో చరిత్ర సృష్టించాడు. గురువారం జరిగిన ఈ పోటీలో విజేతగా నిలిచిన ఈ ఇండియన్ అమెరికన్ 50 వేల డాలర్ల నగదు బహుమతితో పాటు మరికొన్ని కానుకలు సొంతం చేసుకొన్నాడు. 90 సెకన్ల వ్యవధిలో మొత్తం 30 పదాలకుగాను 29 పదాలకు బృహత్ తడబడకుండా సరైన స్పెల్లింగ్ చెప్పాడు. ఫ్లోరిడాలో ఏడో గ్రేడ్ చదువుతున్న బృహత్ సోమ తండ్రి శ్రీనివాస్ సోమ తెలంగాణ లోని నల్గొండకు చెందినవారు. మూడో ప్రయత్నంలో బృహత్ సోమ ఈ టైటిల్ గెలిచాడు. 2022లో ప్రవాస భారతీయ బాలిక హరిణి లొగన్ 26 పదాల్లో 22 పదాలకు సరైన స్పెల్లింగ్ చెప్పడమే మొన్నటి వరకు రికార్డుగా నిలిచింది.

నాగ్‌పూర్‌లో 56 డిగ్రీలు!

- దేశ చరిత్రలో ఇదే అత్యధికం
- ఎండలతో ఉత్తరాది ఉక్కిరిబిక్కిరి
- 60 మందికిపైగా మృత్యువాత
- బీహార్‌లో 32 మంది దుర్మరణం
- వీరిలో 10 మంది ఎన్నికల సిబ్బంది

ఢిల్లీలో తీవ్రమైన ఎండలు తగ్గాలని మంటల మధ్య కూర్చొని తపస్సు చేస్తున్న ఢిల్లీలోని గోరఖ్‌నాథ్ మఠం మహంత్ బాలయోగి బాలక్‌నాథ్ జీ

న్యూఢిల్లీ, మే 31: వడగాడ్పులు, భారీ ఉష్ణోగ్రతలతో ఉత్తరాది రాష్ట్రాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాల్లో గురు, శుక్రవారాల్లో 45 నుంచి 48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహారాష్ట్రలోకి నాగ్‌పూర్‌లోని ఓ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో రికార్డు స్థాయిలో 56 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే, ఇటీవల ఢిల్లీలోని ఓ ఏడబ్ల్యూఎస్‌లోనూ 52.9 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, రీడింగ్స్‌పై దర్యాప్తు చేస్తున్నట్టు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఇప్పుడు నాగ్‌పూర్‌లో ఇంతకంటే ఎక్కువ నమోదు కావడం పట్ల వాతావరణ శాఖ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలు దాటాయి. భరించలేని ఎండవేడి, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వడగాడ్పులు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. వడదెబ్బతో దేశవ్యాప్తంగా దాదాపు 60 మందికిపైగా మృత్యువాత పడ్డారు. ఒక్క బీహార్‌లోనే దాదాపు 32 మంది మృతి చెందారు. వీరిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న 10 మంది సిబ్బంది కూడా ఉన్నారు

ఢిల్లీలో తీవ్రంగా తాగునీటి కొరత

ఒకవైపు ఎండలు తాళలేక ఇబ్బందిపడుతున్న హస్తినవాసులను మంచినీటి కొరత వేధిస్తున్నది. ట్యాంకర్ల వద్ద బిందెలు, క్యాన్లతో జనం బారులు తీరుతున్నారు. హర్యానా నుంచి ఢిల్లీకి సరిపడా నీటిని విడుదల చేయనందుకే నీటి కొరత తీవ్రమయ్యిందని ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తున్నది.

తెలంగాణలోనూ మండుతున్న ఎండలు

హైదరాబాద్, మే 31 (నమస్తేతెలంగాణ): తెలంగాణలోనూ ఎండలు మండిపోతున్నాయి. మంచిర్యాల జిల్లా భీమారంలో, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 47.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెలపాడు, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 46.9 డిగ్రీలు, నల్లగొండ జిల్లా కేతెపల్లి, ఖమ్మం జిల్లా ఖానాపూర్ హవేలీలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నగరాలపై భానుడి ప్రతాపం

- 'అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్' ప్రభావం
- నిర్మాణాలు పెరిగిపోవడమే ప్రధాన కారణం
- ఏసీల వినియోగం అధికమవడమూ సమస్యే
- జూన్ నుంచి కొంత ఉపశమనం ఉండే అవకాశం

హైదరాబాద్,మే 31 (నమస్తే తెలంగాణ): దేశంలో మునుపెన్నడూ లేని విధంగా నగరాల్లో ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. బుధవారం ఢిల్లీలో దాదాపు 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. బెంగళూరు, చెన్నై నగరాల్లో ఉష్ణోగ్రతలు గతంలో ఎప్పుడూ లేని విధంగా పెరిగాయి. నగరాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవడానికి 'అర్బన్ హీట్-ఐలాండ్ ఎఫెక్ట్' కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ అంటే?

గ్రామీణ ప్రాంతాల్లోని ఉష్ణోగ్రత కన్నా, నగరంలో అధిక ఉష్ణోగ్రత నమోదు అవ్వడాన్ని 'అర్బన్ హీట్ -ఐలాండ్' ఎఫెక్ట్ అని పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని సహజ భూఉపరితలంతో పోలిస్తే నగరాల్లో భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉష్ణోగ్రతను ఎక్కువ గ్రహించడం వల్ల ఇది ఏర్పడుతుంది. పైగా నగరాల్లో ఏసీల వినియోగం ఎక్కువ. ఏసీల నుంచి వచ్చే వేడి కూడా అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్‌కు కారణమవుతుంది.

ఉపశమనం ఎప్పుడు ?

మన దేశంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవడానికి 'ఎల్‌నినో' కూడా ప్రధాన కారణం. పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడాన్ని ఎల్‌నినో అంటారు. ఎల్‌నినో బలహీనం కాగానే లానినా ప్రభావం మొదలవుతుంది. పసిఫిక్ సముద్రంలో వాతావరణం చల్లబడటాన్ని లానినా అంటారు. లానినా వల్ల ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు వర్షపాతం కూడా బాగుంటుంది. ప్రస్తుత ఎల్‌నినో 2023లో ప్రారంభమైంది. దీని ప్రభావం ఈ ఏడాది జూన్‌లో ముగుస్తుందని, తర్వాత లానినా ప్రారంభం అవుతుందని వాతావరణ శాఖ చెప్తున్నది.

ఎన్నికల్లో జోక్యానికి ఇజ్రాయెల్ సంస్థ యత్నం!

కాంగ్రెస్‌కు అనుకూలంగా కంటెంట్: ఓపెన్ ఏఐ

న్యూఢిల్లీ, మే 31: భారత్‌లో లోక్‌సభ ఎన్నికల వేళ కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు ఇజ్రాయెలీ సంస్థ స్టయిక్ ప్రయత్నించిందని ఓపెన్‌ఏఐ ఒక నివేదికలో వెల్లడించింది. ఈ సంస్థ అధికార బీజేపీని విమర్శిస్తూ, కాంగ్రెస్‌ను ప్రశంసిస్తూ వ్యాఖ్యలు, కంటెంట్ ఉత్పత్తి చేసి సోషల్ మీడియాతో పాటు పలు వెబ్‌సైట్‌లలో ఇజ్రాయెల్ నుంచే వినియోగించినట్టు పేర్కొన్నది. ఈ సంస్థ రహస్య కార్యకలాపాలను అడ్డుకున్నట్టు తెలిపింది. ఓపెన్‌ఏఐ నివేదికపై కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. దేశంలో, బయట ఈ పని ఎవరు చేశారో విచారణ జరిపి బయటపెట్టాలని ఆయన పేర్కొన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

హెల్మెట్ లేకుండా బైక్ నడిపిన పుణె పోర్షే కేసు జడ్జి

పుణె: ఇటీవల పెను దుమారం సృష్టించిన పోర్షే కారు ప్రమాదం కేసులో నిందితునికి బెయిలు మంజూరు చేసిన జువెనైల్ జస్టిస్ బోర్డ్ జడ్జి దన్వడేపై విపరీతంగా ట్రోల్స్ జరుగుతున్నాయి. ఆయన ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ హెల్మెట్ ధరించకపోవడంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ యూజర్ పెట్టిన పోస్ట్‌లో, 'సమస్య లేదు. హెల్మెట్ లేకుండా స్కూటర్‌ను నడపటంలో ఆనందం గురించి వ్యాసం రాయమని ట్రాఫిక్ పోలీసులు ఆయనకు చెబుతారు' అని ఎద్దేవా చేశారు. మరో యూజర్ స్పందిస్తూ, ఈ వీడియోను పుణె పోలీసులకు, పుణె ట్రాఫిక్ పోలీసులకు ట్యాగ్ చేశారు. 'హెల్మెట్ లేని ఈ స్కూటరిస్ట్‌ను గమనిస్తున్నారని అనుకుంటున్నాను. ట్రాఫిక్ చట్టాల ప్రకారం ఆయనపై చర్య తీసుకుంటారనుకుంటున్నాను. చట్టాన్ని అమలు చేయడంలో తేడాలు ఉండకూడదు' అని స్పష్టం చేశారు.

అమెరికా ప్రతినిధుల సభకు ప్రశాంత్‌రెడ్డి పోటీ

వాషింగ్టన్, మే 31: అమెరికా కాంగ్రెస్ ప్రతినిధుల సభకు భారత సంతతికి చెందిన డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ తరపున కాన్సాస్ నుంచి బరిలో నిలిచారు. 2018 నుంచి వరుసగా మూడుసార్లు ఈ స్థానం నుంచి డెమొక్రటిక్ పార్టీ నుంచి ఎన్నికైన షరీస్ డేవిడ్స్‌పై ఆయన పోటీ చేస్తున్నారు. చెన్నైలో జన్మించిన డాక్టర్ ప్రశాంత్‌రెడ్డికి స్పీకర్ మైక్ జాన్సన్‌తో పాటు రిపబ్లికన్ పార్టీ నాయకులు మద్దతు ఇస్తున్నారు. ఆగస్టు 6న ఎన్నికలు జరుగనున్నాయి.

డొనాల్డ్ ట్రంప్ దోషి

- శృంగార తారకు ముడుపుల కేసులో న్యూయార్క్ కోర్టు సంచలన తీర్పు
- దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడిగా ట్రంప్‌కు అపఖ్యాతి
- అధ్యక్ష ఎన్నికల వేళ కీలక పరిణామం
- ట్రంప్ అభ్యర్థిత్వంపై కోర్టు తీర్పు ప్రభావం ఉండదంటున్న నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): మరో ఐదు నెలల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగనున్న వేళ రిపబ్లికన్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. శృంగార తార స్టార్మీ డేనియల్‌తో వివాహేతర సంబంధం, దానిపై నోరు విప్పకుండా ఉండేందుకు ఆమెకు ముడుపులు ముట్టజెప్పిన కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషిగా తేలారు. ట్రంప్‌పై నమోదైన 34 అభియోగాలు నిరూపణ అయినట్టు న్యూయార్క్ కోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు ఆయన్ని దోషిగా నిర్ధారించింది. ఇలా ఓ కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడు ట్రంపే కావడం గమనార్హం. జూలై 11న ట్రంప్‌నకు శిక్ష ఖరారు చేయనున్నట్టు న్యాయస్థానం వెల్లడించింది.

ఏమిటీ కేసు?

స్టార్మీ డేనియల్ (45) ఓ పోర్న్ స్టార్. 2006లో ట్రంప్‌తో తాను శృంగారంలో పాల్గొన్నట్టు ఆమె ఇటీవల కోర్టులో తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై తాను నోరు విప్పకుండా ట్రంప్ 1,30,000 డాలర్లు ముట్టజెప్పారని వెల్లడించారు. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచి ఆ మొత్తాన్ని ట్రంప్ డేనియల్ కోసం ఖర్చు చేశారని, లెక్కల్లో తప్పులు బయటపడకుండా బిజినెస్ రికార్డులన్నింటినీ ఆయన తారుమారు చేశారని ప్రత్యర్థులు ఆరోపించారు.

జైలుకెళ్లాల్సిందేనా?

ట్రంప్‌పై ప్రధానంగా ఉన్న అభియోగం అక్రమ సంబంధం, బిజినెస్ రికార్డులు తారుమారు చేయడం. అయితే, అమెరికాలో ఈ రెండు నేరాలను తక్కువ తీవ్రత గల నేరాలుగానే పరిగణిస్తారని న్యాయ నిపుణులు చెప్తున్నారు. అక్రమ సంబంధం వ్యక్తిగత వ్యవహారమైనప్పటికీ, రికార్డుల తారుమారుకు గరిష్ఠంగా నాలుగేళ్ల వరకూ జైలు శిక్ష ఉంటుందని అంటున్నారు. అయితే ఏ శిక్ష వేయాలన్నది పూర్తిగా న్యాయమూర్తి విచక్షణ మీదనే ఉంటుందని గుర్తుచేస్తున్నారు. కచ్చితంగా జైలు శిక్ష విధిస్తారని కూడా చెప్పలేమని పేర్కొంటున్నారు. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని, ట్రంప్‌నకు జైలు శిక్షకు బదులుగా జరిమానా విధించవచ్చని మరికొందరు పేర్కొంటున్నారు.

ఎన్నికల్లో పోటీ సంగతేంటి?

తాజా కోర్టు తీర్పుతో ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వంపై ఎలాంటి ప్రభావం ఉండబోదని న్యాయనిపుణులు తెలిపారు. నేరారోపణలు రుజువైతే ఎన్నికల్లో పోటీ నుంచి వైదొలగాలనే నిబంధనేమీ లేదని వెల్లడించారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పోటీలో ఉండాలంటే కనీసం 35 ఏండ్ల వయసు నిండి, 14 ఏండ్లకు పైగా అమెరికాలో నివసిస్తూ పౌరసత్వం కలిగి ఉంటే సరిపోతుందని గుర్తుచేస్తున్నారు. ఒకవేళ, ట్రంప్ జైలుకు వెళ్లినప్పటికీ, అక్కడి నుంచే వర్చువల్‌గా ప్రచారం చేసుకోవచ్చని, గెలిస్తే ప్రమాణం కూడా అక్కడి నుంచి చేసుకొనే వెసులుబాటు ఉన్నట్టు పేర్కొంటున్నారు. 1920లో సోషలిస్ట్ నేత యూజీన్ విక్టర్ డెబ్స్ జైలులో ఉండే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేశారని కొందరు గుర్తుచేశారు. తాజాగా ట్రంప్ సైతం యథావిధిగా ప్రచారం కొనసాగించొచ్చని వెల్లడించారు.

కోర్టు తీర్పుపై ట్రంప్ ఏమన్నారంటే?

కోర్టు తీర్పుపై ట్రంప్ స్పందించారు. తాను అమాయకుడినని పేర్కొన్నారు. అవినీతిపరుడైన ఒక వివాదాస్పద న్యాయమూర్తి జరిపిన విచారణ అనంతరం వచ్చిన ఈ తీర్పు అవమానకరమైనదేనని మండిపడ్డారు. నిజమైన తీర్పు నవంబర్ 5 నాటి అధ్యక్ష ఎన్నికల్లో ప్రజలిస్తారని వ్యాఖ్యానించారు.